క్లుప్తంగా

పేదలకు సంక్రాంతి కానుకలు



కానుకలు అందజేస్తున్న దుర్గారావు బాబ్జి

సంతబొమ్మాళి: స్థానిక నారీమణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని నౌపడలో 600 మంది పేదలకు దుప్పట్లు, చీరలు, లుంగీలు, నగదును సంక్రాంతి పురస్కరించుకొని గురువారం అందజేశారు. ప్రతీ ఏడాది తమవంతుగా సహాయ సహకారాలు అందిస్తున్న ట్రస్ట్ సభ్యులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ చెన్నూరు దుర్గారావు బాబ్జి, లక్ష్మి దంపతులు పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్సు రద్దు

కాశీబుగ్గ: ప్రతీ శుక్రవారం కాశీబుగ్గ పోలీసు డివిజన్ కేంద్రంలో నిర్వహిస్తున్న ఎస్పీ గ్రీవెన్స్‌ను ఈనెల 17వ తేదీన రద్దు చేస్తున్నట్లు పోలీసు ఉన్నత అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. జిల్లా కేంద్రంలో పోలీసు కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ నిర్వహిస్తున్న కారణంగా హాజరు కాలేకపోతున్నట్లు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. కాశీబుగ్గ పరిసర ప్రాంత ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

అమ్మోజికి తెలుగు తేజం పురస్కారం



టెక్కలి: గోదావరి సోషల్ అండ్ కల్చరల్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ సంయుక్తంగా నిర్వహిస్తున్న సాహిత్య పురస్కారాల్లో భాగంగా టెక్కలి మండలం పోలవరం గ్రామానికి చెందిన బమ్మిడి అమ్మోజీని తెలుగు తేజం పురస్కారానికి ఎంపిక చేశారు. శ్రీశ్రీ కళా వేదిక జాతీయ మీడియా ప్రతినిధిగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో అందజేస్తున్న సేవలను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఈనెల 21న విజయవాడలో ఈ పురస్కారం అందుకోనున్నట్లు వెల్లడించారు.

పాలవలస రాజశేఖరం కృషి మరువలేనిది



రాజశేఖరం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

కవిటి: శ్రీకాకుళం జిల్లాలో వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి దివంగత జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పాలవలస రాజశేఖరం చేసిన కృషి మరువలేనిదని, ఆయన లేని లోటు పూడ్చలేనిదని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఇటీవల ఆయన మృతి చెందడంతో గురువారం పాలకొండలోని రాజశేఖరం నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆయనతో పాటు ఇప్పిలి కృష్ణారావు ఉన్నారు.

నేరస్తులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్రీనివాస్

ఇచ్ఛాపురం రూరల్: నేరస్తులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని రూరల్ ఎస్‌ఐ ఈ.శ్రీనివాస్ అన్నారు. 'సంకల్పం' కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన ఈదుపురం గ్రామంలో స్థానికులకు సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు బంగారం, నగదుతో ఒంటరిగా ప్రయాణం చేయవద్దని, అపరిచిత వ్యక్తులు తరుచూ కనిపిస్తుంటే వెంటనే తమకు సమాచారం అందివ్వాలని కోరారు. నకిలీ ఫోన్ కాల్స్, ఓటీపీ వంటి వ్యక్తిగత సమాచారం అందివ్వరాదని తెలిపారు. యువతీ, యువకులు మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని హితవు పలికారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి



హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రాము

టెక్కలి రూరల్: జాతీయ రహదారిపై ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని టెక్కలి ఎస్‌ఐ రాము సూచించారు. గురువారం స్థానిక జగతిమెట్ట జంక్షన్ వద్ద ద్విచక్ర వాహన తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి అపరాధ రుసుములు విధించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదం అందేదెన్నడో..!

- సోంపేటలో అభివృద్ధికి నోచుకోని పార్కులు
- దశాబ్దాలుగా ప్రజల ఇబ్బందులు
- చర్యలు తీసుకోవాలని వేడుకోలు



ప్రహరీకే పరిమితమైన చిల్డ్రన్స్ పార్కు



చిల్డ్రన్స్ పార్క్‌లో ఉన్న ముళ్లపొదలు

సోంపేట: పట్టణ జనాభా రోజురోజుకీ పెరుగుతున్నా సోంపేట ప్రజలకు ఆహ్లాదం అందని ద్రాక్షగానే మిగులుతోంది. సుమారు 30వేల మంది ప్రజలు నివసిస్తున్న ఈ పట్టణంలో పార్కులు అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఫలితంగా ఖాళీ సమయాల్లో ప్రశాంతంగా సేదతీరడం కోసం ఎదురుచూపులే మిగులుతున్నాయి. సోంపేటలో దశాబ్దం క్రితం బాలికోన్నత పాఠశాల పక్కన, పంచాయతీ కార్యాలయం వద్ద పార్కులు ఏర్పాటు చేశారు. బాలికోన్నత పాఠశాల పక్కన ఏర్పాటు చేసిన పార్కులో సుమారు రూ.10 లక్షలు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టినా, పార్కులోకి పట్టణంలోని పలువీధుల మురుగునీరు రావడంతో నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం అక్కడ గత ప్రభుత్వ హయాంలో సులబ్ కాంప్లెక్స్, విశ్రాంతి ఉద్యోగుల భవన నిర్మాణం చేపట్టారు. పంచాయతీ కార్యాలయం వద్దనున్న పార్కు కూడా నిరుపయోగంగా మారింది. దీంతో ప్రస్తుతం సచివాలయ భవనాలు నిర్మాణం చేపట్టారు.

ప్రహరీకే పరిమితమైన చిల్డ్రన్స్ పార్క్

బాలికోన్నత పాఠశాల వద్ద పార్క్ నిరుపయోగంగా మారడంతో 2018 సంవత్సరంలో అప్పటి పంచాయతీ పాలకులు, అధికార పార్టీ నాయకులు అయ్యప్పస్వామి దేవాలయం సమీపంలోని ఎకరా స్థలంలో పార్కు ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. అయితే ఆ పార్కు ప్రహరీకే పరిమితం అయ్యింది. ప్రహరీ గోడలు నిర్మితమైన తర్వాత ఎటువంటి అభివృద్ధి పనులు జరగలేదు. ప్రస్తుతం పార్కు ఆవరణం ముళ్లతుప్పలతో నిండి ఉంది. దీంతో పార్కు వద్దకు వెళ్లాలంటే బయపడే పరిస్థితి ఉంది.

అభివృద్ధికి నోచుకోని చెరువులు

కవిటి-సోంపేట ప్రధాన రహదారికి ఆనుకొని చదంబాల చెరువు, పోలీసు చెరువు ఉన్నాయి. ఈ చెరువులు అభివృద్ధి చేసి సేద తీరేందుకు అనువుగా మార్చేందుకు పాలకులు హమీలు అమలు ఇస్తున్నా అమలు కావడం లేదు. వాస్తవానికి పోలీసు చెరువు, చదంబాల చెరువులు ఆక్రమణలకు గురయ్యాయి. దీంతో ఆక్రమణలు తొలగించి మొక్కలు నాటడంతో పాటు రన్నింగ్, వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే సేద తీరేందుకు బల్లలు ఏర్పాటు చేయాలని విన్నవిస్తున్నారు.



అభివృద్ధికి నోచుకోని చదంబాల చెరువు



ఆక్రమణలకు గురవుతున్న పోలీసు చెరువు

పార్కులు అభివృద్ధి చేయాలి



సోంపేట పట్టణంలో పార్కులు లేకపోవడం వలన అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. విశ్రాంత ఉద్యోగులు, చిన్నారులు, అనేక కుటుంబాలు ఖాళీ సమయాల్లో ప్రశాంతంగా గడిపేందుకు అవకాశం లేకుండా పోతోంది. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి పార్కులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

– సాయి, సోంపేట పట్టణం

సమస్యను తెలియజేస్తాం



పార్కుల అభివృద్ధికి గతంలోనే ప్రతిపాదనలు ఉన్నాయి. సమస్యను ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్తాం. వీలైనంత వేగం పార్కుల ఏర్పాటుకు చర్యలు తీసుకొని, సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

– శాంతికుమారి, పంచాయతీ ఈవో, సోంపేట

శిథిలావస్థలో వంతెన



నందిగాం మండల పరిధిలోని ఆనందపురం వద్ద వంశధార కాలువపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకుంది. ఈ వంతెనపై నుంచి రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ వంతెనను దాటుతున్నారు. దీంతో అధికారులు స్పందించి వంతెనకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– నందిగాం

విరగ్గాసిన పనస



పనస ఇష్టపడని వారుండరు. ఆ మధుర ఫలం ప్రస్తుతం ఉద్దానంలో విరగ్గాసింది. వర్షాలు అనుకూలించడంతో పనస చెట్లు ఈ ఏడాది బాగా పూతకు వచ్చాయి. ఒకే కొమ్మకు 25 కాయలకు పైగా కాయడం ముచ్చట గొలుపుతున్నాయి. ఇది చూసిన రైతులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా ఐదు కాయలకంటే ఒక కొమ్మకు ఎక్కువ కాయవు. కానీ ఉద్దానం రామకృష్ణాపురంలోని చింత రామన్న తోటలో ఈ చెట్టు కొమ్మ మాత్రం అబ్బురపరుస్తోంది.

– వజ్రపుకొత్తూరు

ప్రయాణ పాట్లు



పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ, మందస మండల పరిధిలో ఉన్నటువంటి పలు గ్రామీణ ప్రాంతాలకు చేరాల్సిన బస్సుల రద్దీ తగ్గడం లేదు. సంక్రాంతి వారం రోజులు ముందు మొదలైన రద్దీ ఇంకా కొనసాగుతోంది. ప్రైవేటు, ప్రభుత్వ బస్సులు అనే తేడా లేకుండా ప్రయాణికులకు ఏది దొరికితే అది వినియోగించి గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు.

– కాశీబుగ్గ

బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: మందస మండలంలోని మద్య గ్రామంలో ఉన్న పోలమ్మ తల్లి యువజన విభాగం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. పోటీల్లో 20 టీములు తలపడ్డాయి. వాలీబాల్ విజేతగా టెక్కలి టీమ్ ప్రథమ స్థానంలో నిలవగా రెండో స్థానంలో సాపరాయి మూడవ స్థానంలో మందస పట్టణం సంబంధించిన టీమ్ విజేతలుగా నిలిచారు. పిడి మందస గ్రామ సర్పంచ్ ఉమామహేశ్వరరావు, మాజీ సర్పంచ్ గేదెల రామకృష్ణ, పొట్టి కోదండరావు, గేదెల సుభాష్ చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో బిల్లింగి కామేశ్వరరావు, కద్దాల దామోదర్‌రావు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు బురద ఢిల్లీశ్వరరావు, కొంకి భుజంగరావు, బిల్లింగి ప్రకాష్‌రావు, అగ్గన్న శంకరరావు, సెలగాను వాసుదేవరావు, బురద అనిల్, మడియ సందీప్, బుడుగు శంకర్, ముంజే రేవతి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: ముక్కనుమ పురస్కరించుకొని హరిపురం సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చల్లా కృష్ణారెడ్డి దంపతులు బొడ్డకాళీ గ్రామంలోని వృద్ధులకు దుప్పట్లు గురువారం పంపిణీ చేశారు. ప్రతీ ఏడాది తమ తల్లిదండ్రులు లక్ష్యయ్యరెడ్డి, తరిణమ్మల జ్ఞాపకార్థం దుప్పట్లు, చీరలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

ఉత్సాహంగా డ్యాన్స్ పోటీలు



విజేతలను ప్రకటిస్తున్న రంగస్థల నటుడు కుమార్ నాయక్



ఇచ్ఛాపురం: డాన్స్ ఈవెంట్‌కి అధిక సంఖ్యలో హాజరైన ప్రేక్షకులు

కాశీబుగ్గ: మందస మండలం మామిడిపల్లి గ్రామంలో సంపత్ వినాయక సేవా సంఘం సౌజన్యంతో డ్యాన్స్ ఢీ 2025 ఐకాన్ పోటీలు నిర్వహించారు. గ్రూప్, సోలో రెండు విభాగాల్లో పోటీలు గురువారం నిర్వహించగా 52 మంది కళాకారులు పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా ఢీ 2019 విజేత మహేష్, ప్రముఖ రంగస్థలం నటుడు డాక్టర్ కుమార్‌నాయక్, వాసుదేవరావు, పాతినవేణు వ్యవహరించగా, వ్యాఖ్యతగా నాని అలరించారు. గ్రూపు విభాగంలో సస్ గ్రూపు ప్రథమ బహుమతిని కైవసం చేసుకోగా, ద్వితీయ బహుమతిని క్రేజీ గ్రూప్ కైవసం చేసుకున్నారు. సోలో విభాగంలో ప్రథమ, ద్వితీయ బహుమతులు గీతిక, కిట్టు కైవసం చేసుకోగా, తృతీయ బహుమతి ఆనంగి శ్వేతకు దక్కింది. విజేతలకు బహుమతులను సేవాసమితి సభ్యులు తిరుమలరావు, కిరణ్, విష్ణుమూర్తి అందజేశారు.

ఇచ్ఛాపురం: సంక్రాంతి పురస్కరించుకొని పురపాలక సంఘం బెల్లుపడ గ్రామంలో శివానందగిరిపై త్రినాథస్వామి ఆలయం అభివృద్ధి కమిటీ సభ్యులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గురువారం ఢీ–15 కొరియోగ్రాఫర్ కుమార్ మాస్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన డాన్స్ ఈవెంట్ స్థానికులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఢీ కొరియోగ్రాఫర్ పండు మాస్టర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సాంస్కృతిక కార్యక్రమాలను రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

పరామర్శ



మృతునికి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎంపీపీ దేవదాస్ రెడ్డి తదితరులు

కంచిలి: మండలంలోని జాడుపూడి గ్రామానికి చెందిన పిలక షణ్ముఖరావు (35) కువైట్‌లో అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో జాడుపూడి గ్రామంలో బుధవారం షణ్ముఖరావు అంత్యక్రియలు నిర్వహించారు. కుటుంబ సభ్యులను ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వజ మృత్యుంజయం గురువారం పరామర్శించి సంతాపం తెలియజేశారు. వారితో పాటు పార్టీ నాయకులు కొనపల సురేష్, పలికిలి జయరాం , మద్దు అభియాదవ్, మున్నా, పిలక ఎల్లయ్య రెడ్డి, పిలక వల్లభరావు, చంద్రశేఖర్‌రావు తదితరులు ఉన్నారు.

భవన నిర్మాణం పూర్తి చేయండి



ప్రభుత్వ విప్ అశోక్‌కు వినతిపత్రం అందిస్తున్న కాళింగ సంఘం నేతలు

కవిటి: కవిటి–రాజపురం–కొజ్జిరియా(కేఆర్‌కే) రోడ్డులో గడచిన ఆరు సంవత్సరాలుగా అసంపూర్ణంగా నిలిచిపోయిన శ్రీకృష్ణ భార్గవ కాళింగ సంక్షేమ సంఘం సామాజిక భవన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు ఉదారంగా నిధులు మంజూరు చేయాలని ఆ సంఘం ప్రతినిధులు కోరారు. గురువారం రామయ్యపుట్టుగలోని క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్ డా.బెందాళం అశోక్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. 2014–19 మధ్యకాలంలో ఎంపీ ల్యాడ్స్ నిధులు మంజూరు చేసిన మేరకు భవన నిర్మాణం నలభై శాతం వరకు పనులు చేశామన్నారు. మిగిలిన భవన నిర్మాణం పూర్తిస్థాయిలో చేపట్టేందుకు ఉదారంగా నిధులు అందించి సహకారం అందించాలని విన్నవించారు. కార్యక్రమంలో సర్పంచ్ పూడి లక్ష్మణరావు, బెందాళం చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసీడర్లకు దుస్తుల పంపిణీ



గ్రీన్ అంబాసీడర్లకు కొత్త దుస్తులు అందజేస్తున్న జయరాం

నందిగాం: నందిగాం పంచాయతీ పరిధిలో చెత్తను సేకరించే గ్రీన్ అంబాసీడర్లకు స్థానిక సర్పంచ్ రమణమ్మ సంక్రాంతి సందర్భంగా కొత్త దుస్తులు అందజేశారు. గురువారం స్థానిక సచివాలయం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకుడు జద్యాడ జయరాం చేతుల మీదుగా దుస్తులు పంపిణీ చేశారు.

అభాగ్యులకు దుస్తుల పంపిణీ



ఇస్కాన్ స్వామీజీల చేతుల మీదుగా దుస్తుల పంపిణీలో దాత కన్నారావు

కాశీబుగ్గ: మందస మండలం వీవీఆర్‌పురంలో గాయత్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముక్కనుమ పురస్కరించుకొని వందలాది మందికి అన్నదానం చేసి, వస్త్రాలను గురువారం పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ కొర్ల కన్నారావు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో అనేక మంది అనాథలు పాల్గొనగా ఇస్కాన్ స్వామీజీల చేతులమీదుగా వితరణ చేశారు. పలాస మండలం లొద్దభద్ర గ్రామానికి చెందిన కొత్తపల్లి చిన్నారి గత ఇరవై ఒక్క సంవత్సరాలుగా దుస్తులు పంపిణీ కార్యక్రమం చేపడుతూ వస్తున్నారు. సుమారు 180 గిరిజనులకు దుస్తులతో పాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

సోంపేట:పట్టణంలోని తెలగ కుల సంఘ సభ్యుల ఆధ్వర్యంలో సంఘం తరుపున 2025 సంవత్సరం క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించారు. పట్టణంలోని సోమ పోలమాంబ దేవాలయం వద్ద సంఘం సమావేశం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు ఇ.లక్ష్మీనారాయణ, వల్లభరావు పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక



సోంపేట: సందడి చేసిన బారువ పాఠశాల పూర్వ విద్యార్థులు



కంచిలి: కళా వేదిక వద్ద పూర్వ విద్యార్థులు



పలాస: మామిడిపల్లి గ్రామంలో సందడి చేసిన పూర్వ విద్యార్థినులు



పలాస: బొడ్డపాడులో ఒకచోట కలిసిన పూర్వ విద్యార్థులు

కంచిలి: మండలంలోని పెద్ద శ్రీరాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005–06 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాల ఆవరణలో గురువారం కలుసుకుని సందడి చేశారు. పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకుని, ఒకరిని ఒకరు అప్యాయంగా పలకరించుకున్నారు. కుటుంబ వివరాలు, యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆర్థిక సాయంతో సరస్వతీ కళా వేదికను నిర్మించారు. కళా వేదికను అప్పటి హెచ్‌ఎం నాగేశ్వరరావు గురువారం ప్రారంభించారు. వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. విద్యాశాఖాధికారి ఎస్.శివరాంప్రసాద్, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

పలాస: పలాస మండలం బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2003 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు కనుమ నాడు కలుసుకున్నారు. వీరు ప్రతిఏటా సంక్రాంతి పండగకు గ్రామానికి చేరుకుని పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటారు. అండమాన్, చెన్నై, బెంగలూర్, కలకత్తా, హైదరాబాద్, విశాఖపట్నం, భువనేశ్వర్, బిలాయి వంటి ప్రాంతాల్లో స్థిరపడిన మిత్రులంతా ఒక చోటకు చేరి కబుర్లు చెప్పుకున్నారు. అలాగే మామిడిపల్లి గ్రామంలో పూర్వ విద్యార్థినులు కలుసుకున్నారు.

సోంపేట: మండలంలోని బారువ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2004–07 విద్యా సంవత్సరాల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులు గురువారం కలుసుకుని సందడి చేశారు. పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకుని, ఒకరిని ఒకరు అప్యాయంగా పలకరించుకున్నారు. వారికి విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులను సన్మానించారు.